అమూల్యం

ఆరోజు ఆదివారమైనా అందరూ పెందలాడే లేవటం అమూల్యకు ఆశ్చర్యంగా అనిపించింది. కిటికీలోంచి సన్నగా కురుస్తున్న వానను చూస్తూ ఆనందిస్తున్న అమూల్య వంటింట్లో అమ్మ అలికిడి, హాల్లో నాన్నమాటలు, పక్కగదిలో అన్న జస్వంత్ ఈలపాట విని సంభ్రమంగా లేచి హాల్లోకి వచ్చింది. ఎవరినీ ఏమీ అడగకుండానే అమూల్యకు అర్థమయింది నాయనమ్మ వూరినుంచి వచ్చేది ఆ ఉదయమేనని. సుభద్ర, నారాయణరావు, జస్వంత్ ముగ్గురి హడావుడినీ చూస్తే వాళ్ళింటికి ఏదో ఉపద్రవం రాబోతున్నట్లుంది. ముగ్గురం స్టేషన్‌కి వెళ్లాల్సిందేనంటాడు నారాయణరావు.

"మా అమ్మ ఏవో మూటలూ, పెట్టెలూ చాలా సామానే తెస్తుంది. అవి చూడగానే నాకు చిరాకేస్తుంది. వెంటనే అవతల పారేస్తే ఆవిడ బాధపడుతుంది. వాటిని జాగ్రత్తగా ఇంటికి చేర్చటానికి మీరిద్దరూ రావాల్సిందే"అన్నాడు.

"మీ అమ్మ తెచ్చే మూటలు మోయటం మీకు చిరాకైతే మాకు ఆనందమా? ఐనా ముగ్గురం వెళ్లకూడదు. వెళ్తే ఆవిడ గోల చేస్తుంది. ముగ్గురెలా వచ్చార్రా అంటూ" అంది సుభద్ర కాఫీ కలుపుతూ.

పొద్దున్నే చిటపటమని పడే చినుకుల్లో బైటికి వెళ్ళటమనే ఊహే సంబరంగా అనిపించింది పదేళ్ళ అమూల్యకు. "అమ్మా-నేనూ వస్తా" పేచీ పెట్టబోయే గొంతుతో అడిగింది.

"నువ్వొక్కదానివే తక్కువయ్యావు. అసలు నేనూ వెళ్ళను. నాన్నా, అన్నయ్యా వెళ్తారు. నువ్వెళ్ళి చదువుకో పో" ఒక్క కసురు కసిరింది సుభద్ర. అమూల్య ఇక లాభం లేదని తెలిసి అక్కడ్నించి తన గదిలోకి వెళ్ళి మళ్ళీ కిటికీని ఆశ్రయించింది.

సుభద్రకు అత్తగారు మేనత్తే. చిన్నప్పుడు ఆమె దగ్గరే పెరిగింది. చదువుకునే రోజుల్లో కూడా శలవులన్నీ మేనత్తగారి వూర్లోనే గడిపేది. ఆమె అంటే అభిమానమే కానీ ఇప్పుడు సుభద్ర భయాలు సుభద్రకున్నాయి.

ఆ ఎనభైఏళ్ళ ముసలావిడను ఎప్పుడూ తను భరించగలదా? దాదాపు ఇరవైఏళ్ళ నుంచీ తనూ, భర్తా వూరెళ్లి ఒకపూట ఉండి రావటం తప్ప పదిరోజులు కలిసి ఒకచోట ఉండలేదు. పిల్లలకు ఆ ఒక్కపూటా లేదు. వాళ్ళెన్నడూ ఆ పల్లెటూరు పోలేదు. ఈ నగర జీవిత వేగానికి అలవాటుపడ్డ తమ మధ్యలోకి ఆ ముసలమ్మ వచ్చి తమను ఎట్లాంటి గందరగోళంలో పడేస్తుందోననే భయం భార్యాభర్తలిద్దరికీ ఉంది. నాగరత్నమ్మ కూడా ఇక ఇక్కడ ఉందామనే వస్తోంది. 'ఇన్నాళ్ళుగా కొడుకూ, కోడలూ రమ్మని అంటున్నా వూరు వదలటానికి ఇష్టపడని నాగరత్నమ్మ రెండు నెలల క్రితం వచ్చిన జ్వరానికి భయపడింది. జ్వరం సంగతి పిల్లలకు తెలియనివ్వలేదు గానీ ఆమెకు నేను ఇట్లాగే ఎప్పుడో రాలిపోతానేమో అనే ఆలోచన వచ్చింది. ఆమె భర్త కూడా హఠాత్తుగా గుండె ఆగిపోయి మరణించాడు. అప్పుడు నారాయణరావూ, కూతుళ్లు శాంతి, సుమతి వచ్చే వరకూ భర్త శవం ముందు కూచుని ఆమె పడ్డ బాధ చెప్పలేనిది. చివరి రోజుల్లో పిల్లలు దగ్గిర ఉండాలని ఆమెకప్పుడు గట్టిగా అనిపించింది. ఈ జ్వరం మళ్ళీ ఆ ఆలోచనల్నన్నీ తిరగదోడింది.

అదీ వూరేగాని వల్లకాదు కాదుగా, ఇన్నాళ్ళూ ఈ వూరు అలవాటై పిల్లలకు దూరం అయ్యాను. ఇప్పుడు పిల్లలకు అలవాటైతే వూరు అదే మరుపుకొస్తుంది' అని గుండె గట్టి చేసుకుని కొడుక్కి ఉత్తరం రాసింది ఫలానా రైల్లో వస్తున్నాను, స్టేషన్‌కి రమ్మని.

చివరికి తండ్రీ కొడుకులిద్దరే స్టేషన్‌కి బయల్దేరారు. సుభద్ర అత్తగారి కోసం కాస్త జాగ్రత్తగా ఫలహారం అమర్చే పనిలో పడింది.

రైలు అనుకోకుండా సరైన సమయానికే వచ్చింది. నారాయణరావు అనుకున్నట్టు నాగరత్నమ్మ మూటలేవీ మోసుకురాలేదు. రెండు ట్రంకు పెట్టెలు మాత్రం తెచ్చుకుంది. కొత్తగా రంగేయించిన పెట్టెలు తళతళా మెరుస్తున్నా నారాయణరావు మనసు వాటిని చూడ

గానే ముడుచుకుపోయింది. రెండు మంచి సూట్‌కేసులు కొని ఈ ట్రంకు పెట్టెలు అవతల పారేయించాలి అనుకున్నాడు. సామాను ఎక్కువ లేదనే రిలీఫ్‌తో గబగబా తనూ కొడుకూ చెరో పెట్టె పుచ్చుకుని, ముసలామెను మెల్లిగా నడిపించుకొని స్టేషన్‌బైటికి వచ్చారు. నాగరత్నమ్మకు ఎనభై ఏళ్లయినా కంటి చూపు బాగానే ఉంది. మాటా వినపడుతూనే ఉంది. పళ్ళు కూడా గట్టిగానే ఉన్నాయి. మనిషి కాస్త నిదానంగా తన పనులు తను చేసుకోగల స్థితిలోనే ఉంది.

ఆటోలో ఇంటికొచ్చినంతసేపూ అమూల్యను గురించి అడుగుతూనే ఉంది.

"అదచ్చం నీ పోలికేనే అమ్మా" అన్నాడు నారాయణరావు.

"బుద్ధుల్లో కూడా" జస్వంత్ నవ్వాడు.

"నా బుద్ధులు నీకేం తెలుసురా భడవా" అంది నాగరత్నమ్మ.

"మా అమ్మా నాన్నా చెబుతుంటారుగా" అన్నాడు జస్వంత్ నవ్వుతూ.

సుభద్ర నాగరత్నమ్మను సాదరంగా ఆహ్వానించింది. వాళ్ళది మూడు బెడ్‌రూంలున్న ఇల్లు. పిల్లలిద్దరూ చెరోగది వాడుకుంటున్నారు. అమూల్య గదిలో నాగరత్నమ్మకు నవారు మంచం వేయించి, పరుపు, దుప్పటి అన్నీ సిద్ధం చేశారు.

నాగరత్నమ్మ స్నానం చేసి, టిఫిన్ తిని అందరినీ గదిలోకి పిలిచింది.

ట్రంకు పెట్టె తెరిచింది. ఆ పెద్ద పెట్టెలో ఉన్నాయి నారాయణరావు భయపడిన మూటలన్నీ. ముందు చిన్నమూట తీసి అమూల్యకిచ్చింది.

"ఇదిగో గోరింటాకు, ఎల్లుండి అట్లతద్ది. నిన్న రైలెక్కబోయేముందే కోయించాను. వెంటనే రుబ్బి పెట్టుకో" అమూల్య ముఖం చాటంతయింది. సుభద్ర మనసు కుంగిపోయింది.

"ఇది రుబ్బేదెలా? పెద్దపనే పెట్టిందీవిడ" అనుకుంది.

ఇంకో పెద్దమూట తీసి సుభద్రకిచ్చింది.

"ఇది చిట్టింటాకు కూర. డబ్బాలో పోసి దాయి. నెలకోసారి చిట్టింటాకు కూర తింటే మంచిది. పెసరపప్పు వేసి ఒండు"

సుభద్ర ఇంతటితో ప్రమాదం తప్పినందుకు నిట్టూర్చింది. ఎప్పటి చిట్టింటాకు. ఐనా ఫరవాలేదు. తియ్యగా బాగుంటుంది. ఎన్నడో మర్చిపోయిన రుచిని గుర్తు తెచ్చుకుంది.

జస్వంత్ అప్పటికే పారిపోయాడు.

నారాయణరావు "అమ్మా! రేపు అన్నీ సర్దుకోవచ్చులే. నువ్వు కాసేపు పడుకోరాదూ! రాత్రంతా రైల్లో ప్రయాణం" అన్నాడు.

"అట్లాగే.... గోరింటాకు పాడవుతుందని తీశాను. వెంటనే రుబ్బు తల్లీ" అని పెట్టె మూసేసింది. సుభద్రకూ గోరింటాకు చూస్తే సంతోషంగానే ఉందిగానీ మూలన పడేసిన చిన్న రోట్లో ఇది రుబ్బటం తల్చుకుంటే కష్టంగా అనిపించింది.

వంటయ్యాకా, భోజనాలయ్యాకా అంటూ వాయిదావేస్తూ వచ్చిందిగానీ అమూల్య పోరు పడలేక అట్లాగే రుబ్బింది. స్టీలు గిన్నెలోకి తియ్యబోతుంటే నాగరత్నమ్మ "కొబ్బరి చిప్ప లేదేమిటి? గిన్నెలో కెందుకు గోరింటాకు" అంది.

"ఇంట్లో ఖాళీ కొబ్బరి చిప్పలెందు కుంటాయి అత్తయ్యా" సుభద్ర అప్పటికే పండిన తన చేయి చూసుకుని సంతోషిస్తూ అంది.

"నా దగ్గరుందమ్మా" అంటూ లోపలికి పరిగెత్తి తనచిన్నరేకుల పెట్టెలోంచి కొబ్బరిచిప్ప తెచ్చి ఇచ్చింది అమూల్య.

"నీ కెక్కడిదిది?" అని సుభద్ర అడిగితే,

"పనికిరాని సామానంతా పోగేస్తుందిగా పెట్టెలో. అందులోంచి తెచ్చింది" అన్నాడు జస్వంత్ వెక్కిరింతగా.

"నిన్న గుడిముందు దొరికింది. తెచ్చి శుభ్రంగా కడిగి దాచా" అంది అమూల్య.

"చూశావా నాయినమ్మా అన్నీ నీ బుద్ధులే" జస్వంత్ చెల్లెల్ని మళ్ళీ వెక్కిరించాడు.

కొబ్బరిచిప్ప నిండా అందంగా నిండింది గోరింటాకు. రాత్రి అన్నాలు తిన్నాక పెట్టుకుందామంది సుభద్ర.

"నాయినమ్మా నా పెట్టె చూపించనా?" అంటూ అమూల్య నాయనమ్మను గదిలోకి లాక్కెళ్ళింది.

అమూల్య ఒకటో తరగతిలో ఉండగా పుస్తకాల కోసమని కొన్న అల్యూమినియం పెట్టె అది. రెండో తరగతిలో చేరాక కొత్తబ్యాగు కొనుక్కుంది. ఐతే ఈ పెట్టెను పారెయ్యకుండా అప్పటిదాకా అట్టపెట్టెలో దాచుకున్న తన సామాను ఈ పెట్టెలోకి మార్చుకుంది. ఆ పెట్టెలో రకరకాల వస్తువులుంటాయి. ఆ వస్తువులకు పెద్ద ప్రయోజనం ఉండదు. అదంతా అమూల్య పోగుచేసిన సామాను. ఆ పోగు చెయ్యటంలో కూడా ఒక పద్ధతి, అర్థమూ లేదు. తనకు నచ్చిన వాటినీ, కావాలనిపించిన వాటినీ పోగుచేసి దాచేది. పెద్దవాళ్లు దగ్గరుంటే అడిగి తీసుకునేది. స్నేహితుల దగ్గర ఉన్నవేవయినా అడిగితే వాళ్ళు ఇచ్చేవారు. బదులుగా అమూల్య వాళ్ళకేదయినా ఇచ్చేది. అలాగే దారిలో దొరికినవికూడా తెచ్చి దాచేది. ఇంట్లో అందరూ ముఖ్యంగా జస్వంత్, నారాయణరావు అమూల్య పెట్టెను వెక్కిరిస్తారు. ఒకసారి చిన్న పింగాణీ మూత స్నేహితురాలి దగ్గర్నించి తెచ్చింది. వాళ్ళింట్లో జాడీ పగిలి పోయిందని మూత కూడా పారేశారు. మూత పగల్లేదు సరిగదా, దాని మీద చక్కని డిజైను ఉంది. అమూల్యకు అది తెచ్చుకోవాలనిపించింది. అనితను అడిగి తెచ్చుకుంది. దానికి బదులుగా అనితకు పూసలదండ ఇచ్చింది. ఆ జాడీమూత తెచ్చినరోజు ఇంటిల్లిపాదీ తిట్టారు. ఎందుకీ చెత్తంతా అడుక్కుతెస్తావని విసుక్కున్నారు. తర్వాత వారానికి చిన్న జాడీ మూత పగిలిపోతే సుభద్ర అమూల్యనడిగి ఈ మూత తీసుకుని పెట్టి చూసింది. మూత సరిగా సరిపోయింది.

"అట్లా తీసుకుంటూనే ఉంటారు వెక్కిరిస్తారు" అదీ అమూల్య బాధ.

ఇవాళ కొబ్బరిచిప్పను చూసి నవ్వారుగానీ కొబ్బరిచిప్పలో గోరింటాకు ఎంత బాగుంది.

నాయనమ్మ తన పెట్టె చూసి సంతోషిస్తుందని అమూల్యకెందుకో నమ్మకం కలిగింది.

నిజంగానే నాగరత్నమ్మ చాలా సంతోషించింది. అమూల్య దగ్గరున్న పూసలు,

నెమిలిపింఛాలూ చూసి "అయ్యో నీకివి ఇష్టమని తెలిస్తే బోలెడు తెచ్చేదాన్నే" అంది.

తన పెట్టె తెరిచి అందులోంచి చిన్న ఇత్తడి కుందులు, రాగి గరిటెలు, బుల్లి రాగిచెంబు, ఒక గుర్రపునాడా తీసి అమూల్యకిచ్చింది.

అమూల్య సంతోషం పట్టలేక నాయనమ్మను కావలించుకుంది.

ఆ రాత్రి రెండు చేతులకూ, రెండు కాళ్ళకూ నిండుగా గోరింటాకు పెట్టుకుంది అమూల్య. పక్కబట్టలు పాడవుతాయని సుభద్ర గొణుగుతుంటే నాగరత్నమ్మ పాతచీరె చింపి అమూల్య చేతులకూ, కాళ్ళకూ కట్టింది.

☆☆☆

రెండు రోజులు గడిచాక నాగరత్నమ్మ తన పెట్టెలోంచి మరో మూట బైటికి తీసింది. కోడల్ని పిల్చింది.

"అమ్మాయ్.... మంచి విత్తనాలు, సొర, పొట్ల, కాకర అన్నీ మంచి రకాలు. వంగనారు కూడా ఉంది. దొడ్లో కాసిన కూర రుచి మీరు వండే సూపరు కూరలకు ఎట్లా వస్తుంది" అంటూ విత్తనాలన్నీ చూపించింది.

"అత్తయ్యా మనం ఉండేది మూడో అంతస్తులోని ఒక ఫ్లాట్లో. కాళ్ళకు మట్టి కూడా అంటదు. ఈ పాదులన్నీ ఎక్కడ పెంచుదాం?"

సుభద్ర మాటలకు నాగరత్నమ్మ దిగాలు పడిపోయింది.

"అయ్యో.... మంచి విత్తనాలు. ఐనా కాస్త నేలన్నా లేకుండా ఇట్లా చేస్తున్నారేమిటి? ఇదేం ఇల్లు!"

"బాగుందమ్మా వచ్చిన వాళ్ళందరూ మా ఇంటిని పొగడలేక ఇదైపోతారు. నీకు నచ్చలేదా?" అన్నాడు నారాయణరావు.

"నచ్చకపోవటం కాదురా, కాస్త కూరా నారా పెంచుకోవాలన్నా, ఇన్ని మెంతి గింజలు చల్లుకోవాలన్నా వీల్లేకపాయె" అంటూ ఆలోచించి -

"పోనీ మీ స్నేహితుల్లో ఎవరికీ చారెడు చోటున్న ఇళ్ళు లేవట్రా" అని అడిగింది.

"అమ్మా ... శ్రీనివాస్ అంకుల్ వాళ్ళింటి ముందు బోలెడు చోటు. వాళ్ళకిద్దామా?" అంది అమూల్య ఉత్సాహంగా.

"ఇవ్వండిరా. మంచి విత్తనాలు. మనపేరు చెప్పుకుని తింటారు. ఎప్పుడన్నా మనకూ కాసిని ఇస్తారు."

"అలాగే ఇస్తాలే. ఈసారి నేను వెళ్ళేటప్పుడు తీసుకువెళ్తాను" అన్నాడు నారాయణరావు.

"నువ్వెప్పుడు వెళ్తావో... ఇప్పటికే వానలు వెనకబడ్డాయి. ఇప్పుడు నాటితే గాని సంకురాత్రి నాటికి కాపుకన్నా రాదు. ఇవాళ ఇచ్చిరా అయ్యా నీకు పుణ్యముంటుంది" అంది.

తల్లి తెలివి తక్కువతనానికి నారాయణరావుకి కోపం ముంచుకొచ్చింది.

"ఆ శ్రీనివాస్ ఇల్లు మనింటికి పద్దెనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది. వెళ్లి రావటానికి లీటరు పెట్రోలు.పెట్రోలలా ఉంచి టైమేది? సాయంత్రం నాకు లక్ష పనులున్నాయి" అంటూ హడావుడిగా వెళ్లిపోయాడు.

☆☆☆

సుభద్ర పిల్లల్ని చదువులకీ, భర్తను ఆఫీసుకూ పంపించి వంటిల్లు సర్దుకుని వచ్చేసరికి పదకొండు దాటింది. స్నానం చేసి వచ్చి ఇన్ని పుస్తకాలూ, పేపర్లూ ముందేసుకుని కూర్చున్న కోడలి దగ్గరకు వచ్చింది నాగరత్నమ్మ. సుభద్ర బి.ఏ. చదివేరోజుల్లో ప్రతి శలవలకూ మేనత్త దగ్గరకొచ్చి పదిరోజులుండి వెళ్లేది. వస్తూ వస్తూ కాలక్షేపానికి కథల పుస్తకాలు తెచ్చేది. అప్పుడప్పుడూ వాటిని నాగరత్నమ్మ చదివేది. ఒక్కోసారి నాగరత్నమ్మ అడిగితే సుభద్ర చదివి వినిపించేది. ఆ రోజులు గుర్తొచ్చాయి నాగరత్నమ్మకు.

"ఏదన్నా పుస్తకం ఇవ్వమ్మా. కాసేపు నేనూ తిరగేస్తాను" అంది.

ఏ పుస్తకం ఇవ్వాలో సుభద్రకు తెలియలేదు. 'ఇంట్లో ఏం పుస్తకాలున్నాయి? తెలుగు పుస్తకాలు అత్త చదవగలిగినవి ఏవీ లేవు'.ఐనా కాసేపు వెతికి వచ్చి-

"ఏమీ లేవు. అత్తయ్యా" అంది.

"అదేవిటే! చదువుకునే రోజుల్లో బోలెడు పుస్తకాలు కొనేదానివి. ఏమయ్యాయి?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఎంతకాలమయిందీ. అవెప్పుడో పోయాయి. ఇప్పుడసలు పుస్తకాలు కొనటంలేదు. చదివే తీరిక ఎక్కడిది? ఎన్ని ఇళ్ళు మారాం. ఈ మారటాల్లో ఎక్కడో పోతాయి. స్నేహితులు తీసికెళ్లి ఇవ్వరు. అన్నీ అలా పోతుంటే ఇక చివరికి కొనటం మానేశాను. టి.వి. చూడరాదూ? ఇప్పుడు తెలుగు సినిమా వస్తుంది."

"నా కళ్లు అంతంతమాత్రంగా ఉన్నాయి. ఆ టి.వి. చూస్తే అసలే పోతాయి. నువ్వేదో చదువుతున్నావుగా. అదే పైకి చదువు. కాసేపు వినిపోయి పడుకుంటా" అంది నాగరత్నమ్మ సుభద్రకు దగ్గరిగా జరిగి కూర్చుంటూ.

"ఇవి నీకు అర్థంకావు. కథలు కావివి" సుభద్ర నవ్వింది.

"మరేంటి?" అంది నాగరత్నమ్మ ఆ పత్రికల వంక అసక్తిగా చూస్తూ.

"ఇదంతా వ్యాపారం. డబ్బు ఎట్లా పెట్టుబడి పెట్టాలి? ఎక్కడ పెట్టుబడి పెట్టాలి? ఎట్లా ఎక్కడ పెడితే లాభాలొస్తాయి? అవన్నీ రాస్తారు."

"అవన్నీ నీకెందుకు? నువ్వెందుకు చదువుతున్నావు?" ఆశ్చర్యంగా చూసింది కోడల్ని.

"నేను అన్నీ చదివి వివరంగా మీ అబ్బాయికి చెబుతా. ఇద్దరం ఆలోచించాక ఎక్కడ డబ్బు పెట్టాలో మీ అబ్బాయి వాటిలో పెడతాడు".

నాగరత్నమ్మకు అర్థం కాలేదు. పుస్తకాలు చదివి, ఇంట్లో కూచుని పెట్టుబడి పెట్టి లాభం సంపాదించడం ఆమెకు బొత్తిగా అంతుబట్టలేదు. పెట్టుబడి అంటే కొట్టో, కంపెనీయో, ఏదో ఉండాలిగదా.

ఉత్సాహంగా తన నూతన విజ్ఞానాన్ని వివరించింది సుభద్ర. షేర్ల వ్యాపారం గురించి ఆయాసం వచ్చేవరకూ చెప్పింది.

"పోయినేడాది యాభైవేలు లాభం వచ్చింది. ఈ ఏడాది మొదట్లోనే పదిహేనువేలు నష్టపోయాం. ఫరవాలేదు. అగ్రో కంపెనీలో షేర్ల ధర విపరీతంగా పెరిగింది. ఆ నష్టం పూడి మరో ముప్పైవేలు వస్తాయి."

సుభద్ర చెప్పినదంతా అర్థం చేసుకోవటానికి నాగరత్నమ్మ చాలా ప్రయత్నం చేసింది. అంత ప్రయత్నమూ అయ్యాక చిన్నబుచ్చుకున్న ముఖంతో ఆమె అంది.

"ఐతే అమ్మాయ్, ఇద్దరూ కలిసి జూదం ఆడుతున్నారన్నమాట"

"ఛా.. జూదం ఏమిటి? ఇది వ్యాపారం. ప్రభుత్వం కూడా అంగీకరిస్తుంది"

"బాగానే వుంది. గవర్నమెంటుదైనంత మాత్రాన సారా తాగటం మంచిదంటావా? ఐతే నువ్వు ఆ మంచి పుస్తకాలన్నీ పారేసుకుని ఈ జూదాల పుస్తకాలు చదువుతున్నావా?" నాగరత్నమ్మకు చాలా దిగులనిపించింది.

అత్తను చూస్తే సుభద్రకు ఒళ్లు మండుకొచ్చింది. కష్టపడి డబ్బు సంపాదించుకుని పైకిపోతుంటే జూదం అంటుందా? ఈ ముసలావిడకి ఏమీ తెలియదు. తిని కూచోక చేసే ప్రతిపనినీ ఇట్లా విమర్శించటం మొదలుపెడితే ఇక అయినట్లే. ఎలా వేగాలో ఏమిటో!

ఆ బాధ మర్చిపోటానికి చదువుతున్న 'వ్యాపార ప్రపంచం'లో మనసుని మరింత లగ్నం చేసింది. ఆ పుస్తకాలు చదువుతుంటే సుభద్రకు పరమానందంగా వుంటుంది. ఆ అంకెలు ఆమెను చుక్కల లోకంలో తిప్పుతాయి. అక్కడ వివరించబడే లాభాల కథలు చదివి ఆమె హృదయం వుప్పొంగుతుంది. ఏ బిజినెస్ మాగ్నెట్ గురించో ప్రత్యేకంగా వ్యాసమో, పరిచయమో వుంటే అతని సక్సెస్ స్టోరీకి సుభద్ర పరవశించిపోతుంది. త్వరలోనే తామూ ఆ విజయపథంలో అడుగుపెడతామనే వూహతో ఎంతో ఆనందంగా భర్తరాక కోసం ఎదురుచూస్తుంది.

అతను రాగానే ఈ వార్తలన్నీ చెబుతుంది. అతను మరిన్ని కథలతో వస్తాడు. అన్ని సుఖాలూ త్యాగంచేసి, వచ్చిన ప్రతి పైసా షేర్లలో పెట్టి పదేళ్లలో తన తోటి ఉద్యోగి ఎట్లా కోటీశ్వరుడయ్యాడో, అతని కొడుకు ఇప్పుడు ఎలా విమానంలో చదువుకోసం వూటీ వెళ్తున్నాడో చెబుతాడు. కేరళలో ఒక షేర్‌బ్రోకర్ వీధిలో పాసలమ్ముకునే దశనుండి ఎలా మల్టీమిలియనీర్ అయ్యాడో చెబుతాడు.

ఇద్దరూ ఆనందంగా తమ పథకాలు రచించుకుంటారు. ఏ కంపెనీలో పెట్టాలి? ఎంత పెట్టాలి? అని.

పిల్లలు చదువులు ముగించి అన్నాలు పెట్టమంటూ వచ్చేవరకూ యిదే వరస. మధ్యలో స్నేహితులొస్తే వాళ్లింకా మంచి కబుర్లు చెబుతారు. సలహాలిస్తారు.

నాగరత్నమ్మకు వారం రోజుల్లో ఈ వాతావరణం విసుగెత్తింది.

పిల్లలకింత డబ్బు పిచ్చి పట్టుకుందేమిటి?

అబ్బాయి మంచి గవర్నమెంటు ఉద్యోగమే చేస్తున్నాడు. ఎందుకీ హైరానా? ఓ ఆట లేదు. ఓ పాటలేదు. టి.వి.లో కూడా వాళ్లు చూసేది ఈ షేర్ల గురించిన విశేషాలే.

డబ్బు సంపాదించాలిగానీ, అది తప్ప మరింకో జీవితం లేకపోయాక ఆ డబ్బెందుకు అన్నది నాగరత్నమ్మకు అర్థం కాలేదు.

ఐతే ఆ విషయం కూడా నెలరోజులు గడిచేసరికి అర్థమైంది.

జస్వంత్‌కు వాంతులు పట్టుకున్నాయి. అది తెలియగానే నాగరత్నమ్మ తన దగ్గరున్న మందునూరి తేనెలో కలిపి మనవడికి ఇవ్వటానికి వెళ్లింది.

"ఇంకా నయం" అన్నాడు జస్వంత్.

అప్పటికే అతను పవర్‌ఫుల్ యాంటీబయటిక్స్ వాడటం మొదలుపెట్టాడు.

రెండో రోజుకి కూడా తగ్గకపోతే మంచి డాక్టరుకి చూపమనీ, అశ్రద్ధ చేయవద్దనీ ఫోన్లొచ్చాయి స్నేహితుల దగ్గర్నించి.

జస్వంత్‌ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షలకోసం రెండురోజులు ఆసుపత్రిలో ఉంచమంటే ఉంచారు.

నాగరత్నమ్మకు అంతా అయోమయంగా ఉంది. వానాకాలం పోతూపోతూ నాలుగు చినుకులు గట్టిగా కురిసింది. చలికాలం మెల్లిగా జొరబడుతోంది. వాతావరణం మారేటప్పుడు శరీరం కాస్త అటూ ఇటూ అవదూ? పైగా ఏ కాలంలో తినాల్సిన కూరలూ, పళ్లూ ఆ కాలంలో తినరు. ఎప్పుడూ ఒకటే కూరలు. కాస్త తనిచ్చిన మందు మూడుపూటలు నాకితే సరిపోయేది. కానీ ఈ మాటలు ఎవరు వింటారు?

అమూల్యతో చెప్పుకునేది. అమూల్యకు నాయనమ్మమీద జాలేసేది.

"నాకు వాంతులైతే నేను నీ మందే వేసుకుంటాలే నాయనమ్మా" అంది.

రెండు రోజులనుకున్నది జస్వంత్ ఆసుపత్రినుంచి వచ్చేసరికి పదిరోజులయింది. చిక్కిశల్యమై వచ్చాడు. జబ్బేమీ లేదని తెలియటానికి దగ్గర దగ్గర పదివేలు ఖర్చయ్యాయి.

మరి వీళ్లకు డబ్బు సంపాదించకపోతే ఎలా గడుస్తుంది? అందుకే అస్తమానం డబ్బు, డబ్బు, డబ్బు అంటూ తిరుగుతుంటారు. కానీ ఏం లాభం? అట్లా సంపాదించి ఇట్లా ఆస్పత్రులకు అనవసరంగా తగలేస్తున్నారు అనుకుని నిట్టూర్చి వూరుకుంది.

ఎన్నిరోజులు గడిచినా ఆ శ్రీనివాసన్న అబ్బాయికి విత్తనాలు ఇవ్వటం కుదరనేలేదు కొడుక్కి. "ఇప్పుడివ్వకపోతే ఇక అనవసరంరా" అంది కొడుకుతో ఓ రోజు నిష్ఠూరంగా.

"అనవసరమైతే అవతల పారెయ్. నాకు తీరికలేదు. దగ్గరా దాపా! ఈ బోడి విత్తనాల కోసం నేనంతదూరం వెళ్ళలేను"

నాగరత్నమ్మకు చాలా బాధనిపించింది. నెలరోజుల్నించీ తీరటం లేదంటాడు. ఎన్నడన్నా తీరుతుందా? తల్లిబాధ చూసి నారాయణరావు అతిప్రయత్నంమీద కోపం ఆపుకుని,

"సరే ఇలా ఇవ్వు. సాయంత్రం ఆఫీసునుంచి వాళ్ళింటికి వెళ్ళి ఇచ్చొస్తాను" అన్నాడు.

నాగరత్నమ్మ అదే చాలన్నట్లు విత్తనాలు మూటగట్టి ఇచ్చింది.

ఆ మూట జేబులో కుక్కుకుని వెళ్లాడు నారాయణరావు. అమూల్య అదంతా చూస్తూ బడికి వేళవుతోందని మర్చిపోయింది. తల్లి కేకలేస్తే హడావుడిగా బస్‌స్టాప్‌కి పరిగెత్తింది.

తనవెనకే మెట్లు దిగిన తండ్రి స్కూటర్‌ని బస్టాపు పక్కనున్న చెత్తకుండీ దగ్గర ఆపటం చూసి తన కోసమేననుకుని నాలుగడుగులు ముందుకు వేసింది. ఇంతలో నారాయణరావు జేబులోంచి విత్తనాల మూటతీసి చెత్తకుండీలో పారేసి స్కూటర్‌మీద వెళ్లిపోయాడు.

అమూల్యకు ఏం చెయ్యాలో తొచలేదు. నెమ్మదిగా చెత్తకుండీ దగ్గరకు వెళ్లింది. పైనే వుంది. ఆ మూటకి మురికేమీ అంటలేదు. తీసి తన బ్యాగులో వేసుకుంది. ఆ పిల్లకు పట్టరానంత దుఃఖం వచ్చిందిగానీ రోడ్డుమీద ఏడవటానికి లేదు. అతిప్రయత్నం మీద కంట్రోలు చేసుకుంటుండగా స్కూల్ బస్ వచ్చేసింది.

ఆ రోజంతా అమూల్య మనసు మనసులో లేదు. పాఠాలేవీ బుర్రకెక్కలేదు. ఈ సంగతి నాయనమ్మతో చెప్పాలా? ఒద్దా? చెబితే నాయనమ్మ బాధ పడుతుంది. నాన్నకు కోపం వస్తుంది. కొడతాడేమో కూడా. చెప్పకపోతే నాయనమ్మను మోసం చేసినట్లవదూ? నాన్న చేసినట్లే తనూ మోసం చేస్తుందా? అసలు నాన్న అట్లా ఎందుకు చేశాడు?

ఈ ఆలోచనల్తోనే బడినుండి ఇంటికి వచ్చింది. నాయనమ్మ వంటింట్లో వున్నప్పుడు ఆ విత్తనాల మూటతీసి తన పెట్టెల్లో అడుగున కనపడకుండా దాచింది. ఆ రాత్రి నాయనమ్మ కథలు కూడా అమూల్య మనసులోకి ఎక్కలేదు.

"నువ్వు విత్తనాలిస్తే మనూళ్లో వాళ్లు నాటతారా నాయనమ్మా" పట్టలేక అడిగింది.

"బంగారంలా నాటతారు. అమ్మ కడుపు చల్లగా మంచి విత్తనాలిచ్చిందంటూ నాటతారు"

"అసలు నువ్వు వూర్నించి ఎందుకొచ్చావు నాయనమ్మా"

"మీ కోసమేనమ్మా.ఎన్నాళ్లుంటాను చివరి రోజుల్లో మీ అందరితో కలిసి సంతోషంగా వుందామని వచ్చాను. మీ నాన్న ఎన్నేళ్లనుంచో రమ్మంటున్నాడు. నేనే రాననేదాన్ని".

'నాన్నకు నాయనమ్మంటే ఇష్టమే. కానీ మరెందుకలా చేశాడు? నాయనమ్మంటే ఇష్టమేగాని ఆమె మాటంటే లెక్కలేదు. నాయనమ్మ పనికిరాని పాతదనుకుంటున్నారు. పాతవంటే అమ్మకీ నాన్నకీ ఇష్టంలేదు. అన్నీ పారేస్తారు. నాయనమ్మంటే చాలా ఇష్టం గనక వుంచుకున్నారు. లేకపోతే పారేసేవారే. చక్కగా విత్తనాలిస్తే ఏమయ్యేది? శ్రీనివాస్ అంకుల్ వాళ్లింట్లో కాయలు కాసేవి. ఎట్లా పారేశాడు నాన్న?'

ఈ ఆలోచనల్తోనే నిద్రపోయింది.

☆☆☆

మరో నెల గడిచిపోయింది. ఈ నెలరోజుల్లో నాగరత్నమ్మకు తను ఈ ఇంట్లో పనికిరానిదాన్ననే భావం బాగా పాతుకుపోయింది.

తను మాట్లాడిందేదీ వాళ్లకు అక్కర్లేదు. తన వంటలు వాళ్లు చెయ్యరు. అన్నీ బజార్నించి కొనుక్కుతెస్తారు. పచ్చళ్లు పెట్టనివ్వరు. ఉంటే తినబుద్ధేస్తుంది. తింటే అనారోగ్యం. మరీ తినాలనిపించినప్పుడు కొనుక్కుంటే సరిపోతుంది అంటారు. తన వైద్యం అసలు పనికిరాదు. నెలకోసారి ఇంట్లో ఎవరో ఒకరు డాక్టరు దగ్గరకుపోయి వందలకు వందలుపోసి మందులు తెచ్చుకుంటారు.

ఈ పిల్లలతో ఏం పొందాలని వచ్చింది? ఏం పొందింది? ఊళ్లో తనకెంత గౌరవం. రోజూ ఇద్దరు ముగ్గురొచ్చి ఏదో ఒక మందు తీసికెళ్తారు. పథ్యానికి చింతతొక్కో, ఎండావకాయో తీసికెళ్తారు. ఉసిరిక లేహ్యం ఎంత పట్టినా చాలదు. సాయంత్రమయ్యేసరికి పదిమంది వచ్చి వెళ్తారు. వాళ్లు చేసే సాయాలు వాళ్లూ చేస్తారు. పుల్లలు తెస్తారు. నీళ్లు తెస్తారు. చేలల్లోంచి దోసకాయలు తెచ్చిస్తారు. ఇక్కడ మనిషికి మనిషి మాటలు తప్ప ఇచ్చేదేమీ ఉండదు.

కొడుకూ కోడలూ ఆ జూదం కబుర్లు ఆపితే ఇక వాళ్ల స్నేహితుల గురించి మాట్లాడుకుంటారు. ఒక్క మంచిమాట వుండదు. అందరినీ విమర్శించటమే. వీళ్ళ మాటలే నిజమైతే వీళ్లకి ఒక్క మంచి స్నేహితుడు లేడు. అందరూ గోతులు తీసేవాళ్ళే. అందరూ వీళ్ళనుపయోగించుకోవాలని చూసేవాళ్లే. వీళ్లు చెడిపోతే చూసి సంతోషిద్దామనుకునేవాళ్లే.

నిజంగానే ఈ పట్నంలో మనుషులట్లా అయ్యారా? లేక వీళ్లకు పిచ్చెక్కిందా?

మళ్ళీ వాళ్లు వచ్చినప్పుడు అందరూ బాగానే నవ్వుకుంటూ మాట్లాడుకుంటారు.

ఇది వూరు కాదు, వల్లకాడే అనిపించింది నాగరత్నమ్మకు. వూరుమీద గాలి మళ్ళింది.

నాగరత్నమ్మకు వూరు వెళ్దామనే ఆలోచన క్రమంగా బలపడుతుండగా ఓ సంగతి జరిగింది.

ఆ ఇంట్లో పనిచేసే జయ కొడుకు ఏడాది నిండని పసివాడికి విరేచనాలు పట్టుకున్నాయి.

పిల్లాడిని ఆస్పత్రికి తీసికెళ్ళాలి. ఓ వందరూపాయలు ముందుగా ఇప్పించమని సుభద్రను అడిగింది. సుభద్ర తన దగ్గర లేవంది.

జయ పాపం కళ్ళనీళ్ల పెట్టుకుంది. ఆ పిల్లమొగుడు తాగుబోతు. ఏమి పట్టించుకోడు. ఇప్పుడింకో దారిలేదు. సుభద్రను బతిమాలింది. సుభద్ర లేవంటే లేవంది.

నాగరత్నమ్మ ఇదంతా విస్తుపోతూ చూసింది. అప్పుడెప్పుడో ఇరవయ్యేళ్ళ క్రితం సుభద్ర శలవలకు వచ్చినప్పుడు నాగరత్నమ్మకు ఓ కథల పుస్తకంలో ఇట్లాంటి కథే చదివి వినిపించింది. అప్పుడు సుభద్ర పనిమనిషి పక్షం. ఆ రచయిత ఎంత బాగా రాశాడంటే చదువుతూ చదువుతూ సుభద్ర ఏడ్చేసింది.

నాగరత్నమ్మ కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి.

ఇప్పుడు సుభద్ర యజమాని అయింది. పనిమనిషి కష్టానికి స్పందించటం మానేసింది.

నాగరత్నమ్మ వెళ్ళిపోతున్న జయను వెనక్కు పిల్చింది.

"నీ పిల్లాడికేమయింది?" అనడిగింది.

జయ చెప్పింది.

"నేను మందు నూరి ఇస్తా తేనెలో రంగరించి గంటకోసారి నాలిక్కిరాయి. రేప్పొద్దునకంతా తగ్గుతాయి" అని చిన్నరోలు తెప్పించి మందు నూరింది. చిన్న సీసా తెప్పించి కాస్త తేనె అందులో పోసి ఇచ్చింది. జయ దణ్ణం పెట్టి అవి తీసుకుంది. అమూల్య అదంతా జాగ్రత్తగా చూసింది. మధ్యలో సుభద్ర కూడా చూసింది. అమ్మకు చాలా కోపంగా వుందని అమూల్యకు అర్థమైంది.

వెళ్ళబోతున్న జయను సుభద్ర పిల్చింది. అమూల్య కూడా జయతోపాటువెళ్ళినిల్చుంది.

"ఆ మందు అవతల పారెయ్. ఇవిగో వందరూపాయలు. డాక్టరు దగ్గరకు తీసుకుపో. ఆ మందేస్తే పిల్లాడికేమన్నా అయితే మామీద పడి ఏడుస్తావు. ఆ మందు మాత్రం వాడకు. ఆ మాట ఆవిడతో చెప్పొద్దు. సరేనా?'

సుభద్ర కోపం అణుచుకుని సాధ్యమైనంత శాంతంగా చెప్పింది.

జయ సరేనని తలవూపి వందరూపాయలు తీసుకుని వెళ్ళిపోయింది.

కళ్లు పెద్దవి చేసుకుని చూస్తున్న అమూల్యను చూసి, "నాయనమ్మతో చెప్పకు చెబితే చంపుతా" అని గద్దించింది.

"ఈవిడ మందులేమిటో. అందరి ప్రాణాలూ తీస్తానంటే ఎట్లా? దాని కొడుకు ఈ మందులకు చచ్చాడంటే మనమీదికొస్తారు. ఎందుకంత రిస్కు. వందరూపాయలు చచ్చినట్లు ఇచ్చా. అంతకుముందుదాకా నా దగ్గర లేవంటే లేవన్నదాన్ని పది నిమిషాల్లో యిస్తుంటే ఆ

జయ ఒక చూపు చూసింది. నా ఒళ్లు చచ్చిపోయిందనుకోండి. ఐనా ఈ ముసలామె తిని పడుండక ఈ లేనిపోని తద్దినాలు తెచ్చిపెడుతుంటే ఎట్లా?"

సుభద్ర ఆ సాయంత్రం నారాయణరావుతో చెబుతున్న మాటలు కూడా అమూల్య వింది.

అమూల్యకెటూ పాలుపోలేదు. అమ్మ అన్నట్లు నాయనమ్మ మందులు పనిచెయ్యక ఆ పిల్లాడికేదన్నా అయితే! కానీ నాయనమ్మను మళ్ళీ మోసం చేశారు. ఈ మాటలే నాయనమ్మతో చెప్పొచ్చుగా. అమూల్య మనసు బాధతో మూలిగింది.

నాలుగురోజుల తర్వాత ఇంట్లో సుభద్ర లేని సమయం చూసుకుని జయ వచ్చింది. నాగరత్నమ్మకు దణ్ణం పెట్టింది.

"మీరిచ్చిన మందు బాగా పనిచేసిందమ్మా. రెండో రోజుకే విరేచనాలు కట్టుకున్నాయి. అమ్మగారు ఆ మందు అవతలపారేసి డాక్టరుకి చూపించమని వందరూపాయలిచ్చింది. నాకు మీ మందుమీద గురి కుదిరి అదే వాడాను. అమ్మగారికి భయం. మీ మందు వికటించి పిల్లాడికేమైనా ఔతుందేమోనని, అందుకనే పారెయ్యమన్నారు".

నాగరత్నమ్మ ముఖం నెత్తురుచుక్క లేకుండా పాలిపోయింది.

జయ ఎప్పుడు వెళ్ళిందో కూడా ఆమెకు తెలియదు. ఇక ఈ వూళ్ళో ఒక్కక్షణం కూడా వుండాలనిపించలేదు. తక్షణం వూరెళ్లిపోవాలనుకుంది.

అమూల్య స్కూలునుంచొచ్చి నాయనమ్మ వీపుమీద ఉయ్యాల వూగబోయి ఆమె ముఖం చూసి ఆగిపోయింది.

నాగరత్నమ్మ అమూల్య ముఖం చూసి నవ్వు తెచ్చుకుంది.

"చిట్టీ నేను వూరెళ్ళి పోతానే" అంది. అమూల్యకు అర్థమయింది.

"నాయనమ్మా జయ చెప్పిందా?"

నాగరత్నమ్మ చివ్వున తలెత్తింది.

"ఐతే నీకూ తెలుసా?"

అమూల్య బిక్కముఖం పెట్టింది.

"ప్రమాదం చేసే మందు నేనెందుకిస్తాను? మీ అమ్మకు చిన్నప్పుడు ఎన్నిసార్లు ఈ మందు ఇవ్వలేదూ? నన్నడగొచ్చుగా. ఓ మాట చెప్పొచ్చుగా. నాకంత విలువలేనిచోట నేనుండకూడదమ్మా"

"నిజంగా వెళ్ళిపోతావా నాయనమ్మా?"

నాయనమ్మ వెళ్ళిపోతుందంటే అమూల్యకు బాగా దిగులుగా వున్నా ఒకరకంగా అదే మంచిదనిపించింది.

అమ్మా నాన్నా నాయనమ్మ మాటలు లెక్కజెయ్యరు.

నాయనమ్మంటే ఇష్టమేగాని బాధపెడతారు.

వీళ్ళిద్దరికీ ఎక్కడో చాలా తేడావుంది. ఇద్దరిదీ నిజమేగదా అనిపిస్తుంది. కానీ అమ్మా నాన్నా అన్యాయంగా వుండటం మాత్రం తప్పే!

అమూల్యకు క్లాసులో టీచరు చూపించిన ప్రపంచపటం గుర్తొచ్చింది. ఆ పటంలో కొన్ని ద్వీపాలను చూపించి వివరించారు టీచరుగారు. ఎట్లాగో తెలియటం లేదుగానీ అమ్మా వాళ్లూ, నాయనమ్మా వేరు వేరు ద్వీపాల్లాగా వున్నారనిపించింది.

ఈ ద్వీపాలలో తను దేనికి చెందుతుంది? ప్రస్తుతం అటూ ఇటూ తిరుగుతోంది. ఎక్కడ, ఏ ద్వీపంలో వుంటే బాగుంటుంది, ఏది మంచిదో, ఎక్కడుండాలో తనకింకా తెలియటం లేదు. లేకపోతే తనదింకో ప్రత్యేకమైన ద్వీపమేమో! అమ్మో తనొక్కత్తేనా? అమ్మకో, నాయనమ్మకో చెందకుండా తను ఒక ద్వీపంలో- అమూల్యకు దిగులుగా, భయంగా అనిపించింది.

ఆరోజు రాత్రి ఆవేశం ఆపుకోలేక నాగరత్నమ్మ అమూల్యకు తనకు తెలిసిన వైద్యం ఎంత మంచిదో ఎంతమందిని రక్షించిందో వర్ణించి చెప్పింది.

"అట్లాంటి నన్ను తీసిపారేసింది మీ అమ్మ. నేనెందుకు ఇక్కడ? నాకు విలువ యిచ్చేవాళ్లే నా వాళ్లు. ఇక్కడ నా వాళ్ళెవరూలేరు"

నాగరత్నమ్మకు ఏడుపాగలేదు.

అమూల్య ఆమెను సముదాయించాల్సి వచ్చింది.

"నాయనమ్మా నీకు తెలిసిన మందులన్నీ నాకు చెప్పు, నేను నా నోట్సులో రాసుకుంటాను.. నేను పెద్దయ్యాక డాక్టరవుతానుగదా, అప్పుడు నీ మందులే అందరికీ ఇస్తాను."

"నా తల్లే.. నా తల్లే" అని అమూల్యను ముద్దాడింది నాగరత్నమ్మ.

అమూల్య నిజంగానే పుస్తకం, పెన్నూ తెచ్చుకుంది. వారం రోజులపాటు నాయనమ్మ చెప్పిన మందుల పేర్లన్నీ రాసుకుంది. సగం పైగా వంటింట్లో వున్నవే. కొన్ని చెట్ల పేర్లూ, దినుసుల పేర్లూ అమూల్య ఎన్నడూ వినలేదు. అంతా రాశాక ఆ పుస్తకం చూస్తే నాగరత్నమ్మకు గుండె నీరయింది.

'తనేంటో అదంతా ఆ పుస్తకంలో వుంది. తను పోయినా మనవరాలు ఆ పుస్తకం చూసి తన వైద్యం చేస్తుంది. అపుడందరికీ తను దగ్గరగా వున్నట్లే వుంటుంది. చచ్చినా బతకటమంటే ఇదే!'

అనుకునేసరికి ఆమెకు ఈ ప్రపంచాన్ని జయించిన ధీమా వచ్చింది. అంతలోనే ఏదో అనుమానం వచ్చింది.

"మీ అమ్మానాన్నల్లా నేనటు వెళ్ళగానే ఈ పుస్తకం పారెయ్యవుగదా"

ఈ మాటలకు గాయపడ్డ అమూల్య ముఖం చూసి నాగర్నతమ్మ అమూల్యను దగ్గరకు తీసుకుని,

"వూరికే నవ్వుతాలికన్నా, మా అమ్మవు కదూ" అంటూ సముదాయించింది.

☆☆☆

ఆ తర్వాత పదిరోజులకు నాగరత్నమ్మ వూరు ప్రయాణమయింది. నారాయణరావు తెచ్చిన సూట్‌కేసులు ఒద్దని తన ట్రంకు పెట్టెలే సర్దుకుంది.

అమూల్య దిగులుగా తిరుగుతోంది. నారాయణరావు, సుభద్రలకు ఏ మూలో గిల్టీగా వున్నా కాస్తంత రిలీఫ్‌గా కూడా వుంది. జస్వంత్ హుషారుగా ఆటో తెచ్చాడు.

నాగరత్నమ్మ ఆటో ఎక్కింది.

"నాయనమ్మా........ ఒక్కనిమిషం" అమూల్య లోపలికి పరిగెత్తి తన పెట్టెలోంచి విత్తనాల మూట తీసుకొచ్చి నాయనమ్మ చేతిలో వుంచింది.

"ఇవి మన వూళ్ళోనే బాగా బతుకుతాయి నాయనమ్మా. ఈ వూళ్ళో బతకవు"

ఆ మూట చూసి నారాయణరావు ముఖం నల్లగా మాడిపోయింది.

నాగరత్నమ్మ ఆ మూటను జాగ్రత్తగా పెట్టెలో దాచుకుంది. ఈ పోటీ ప్రపంచంలో, వ్యాపార ప్రపంచంలో ఆమెకు తన స్థానం ఏమిటో తెలిసిందిగానీ, తన పిల్లలు ఈ ప్రపంచంలో పడి ఏమైపోతారో, ఎటు కొట్టుకుపోతారో అనే దిగులు వదల్లేదు. కాని అమూల్యను చూస్తే ఏదో ఆశ.

తన విత్తనాలను విత్తుతుందేమో,
తన వైద్యాన్ని పదిమందికీ చేస్తుందేమో,
ఏమో....

అది అమూల్య ఒక్కదాని చేతిలో లేదుగదా, అమూల్య తరం ఏం చేస్తుందో?

అమూల్యమైన విత్తనాలను జారవిడుచుకుంటుందో, రక్షించుకుంటుందో!

అమూల్యమైన జ్ఞానాన్ని పెంటకుప్పలమీద పారేసి, అన్యులకు ధారదత్తం చేసి, చేతులారా అనారోగ్యాన్ని ఆహ్వానిస్తుందో.....

తన ముంగిట్లో పెరట్లో వున్న జ్ఞానాన్నిరెండు చేతులా పట్టుకుని కాపాడుకుంటుందో.....

ఏమో..... ఏం చేస్తుందో.

విపుల, డిసెంబర్ 1994